క్లుప్తంగా

మరుగుదొడ్లను వాడండి



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దతిప్పసముద్రం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని అధికారులు, వైద్య సిబ్బంది సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆరుబయట మల విసర్జనతో కలిగే దుష్ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



చాదర్ మోసుకొస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంగళవారం కడప పెద్ద దర్గాను దర్శించుకున్నారు. ఆయన చాదర్‌ను మోసుకెళ్లి దర్గాలో సమర్పించారు. అక్కడే మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, వర్షాలు కురిసి పాడి పంటలతో తులతూగాలని ప్రార్థించారు. ఆయనవెంట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఆధార్ కేంద్రం కావాలని ధర్నా

బి.కొత్తకోట: బి.కొత్తకోట పట్టణానికి మరో ఆధార్ కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు, విద్యార్థులు ఆధార్ కేంద్రం వద్ద మంగళవారం ధర్నా చేశారు. విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్ల కోసం ఆధార్ సేవలు పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే కేంద్రం ఉండటంతో వేలాది విద్యార్థులకు సేవలందించడంలో జాప్యం జరుగుతోందని, వెంటనే మరో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కురబలకోట: అంగళ్లు పంచాయతీలో 220/2బి సర్వేనెంబరులో హంద్రీనీవా భూమిని కాజేసి సొమ్ము చేసుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు క్రిష్టప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన భూమిని వారు మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ భూమి ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఇందిరాగాంధీ జయంతి



మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

కలికిరి: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. గ్రంథాలయాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు హాజరై ప్రసంగించారు. సమాజంలో సమూల మార్పుతోనే మహిళలకు రక్షణ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

మదనపల్లె: రుతుక్రమ పరిశుభ్రతను పాటిస్తే విద్యార్థినులు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని అనంత్ మునిరాజ్, జయశ్రీ తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కాలేజీలో మహిళలు, బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హ్యాపీ యుటిరస్, హెల్తీ పీరియడ్స్‌పై విద్యార్థులకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ చైర్మన్ డాక్టర్. ఎస్.కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ.రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

రామసముద్రం: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ భానుప్రసాద్ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి స్థానిక దిగువపేట, బజారువీధి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడి శాలువతో ఘనంగా సన్మానించారు. మునిస్వామినాయక్, విజయ్‌గౌడు, బాలాజీ, కృష్ణప్ప, రెడ్డెప్ప, జయరాజ్ పాల్గొన్నారు.

18 మంది ఉద్యోగాలకు ఎంపిక

పీలేరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడ్ ఆఫ్ అండ్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్జీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 18 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 42 మంది అభ్యర్థులు హాజరు కాగా 18 మంది ఎంపికైనట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేష్, హరీష్ పాల్గొన్నారు.

వసతి.. అధోగతి!

సాక్షి విజిట్

పేద విద్యార్థులు చదువుకొనే సంక్షేమ హాస్టళ్లు బందీఖానాలను తలపిస్తున్నాయి. వసతి గృహాల చుట్టూ ముక్కుపుటలదిరే దుర్గంధం.. శిథిలావస్థకు చేరి భయపెట్టే పైకప్పులు.. అద్దాలు పగిలిన కిటికీలు.. పెచ్చులూడి పడుతున్న గదులు.. చిరిగిన దుప్పట్లు.. దోమల బెడద.. నిద్రలేని రాత్రులు ఇలా ఎన్నో సమస్యలు హాస్టళ్లను వెంటాడుతున్నాయి. హాస్టల్ విద్యార్థులకు భద్రత, సౌకర్యాలు పెంచాలని న్యాయస్థానం ఆదేశించినా పాలకులు, అధికారుల్లో చలనం కరవైంది. ఇవన్నీ వెరసి విద్యార్థుల కష్టాలు తడిసి మోపడవుతున్నాయి.

- అధ్వాన్నంగా బి.కొత్తకోట సంక్షేమ హాస్టల్
- అద్దె భవనాల్లో వసతి గృహాలు
- పెచ్చులూడి పడుతున్న గదులు



మదనపల్లె గిరిజన్ హాస్టల్‌లోని రేకుల షెడ్‌లో విద్యార్థులు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో గిరిజన సంక్షేమ హాస్టళ్లు రెండు ఉన్నాయి. ఎంఎల్ఎల్ ఆస్పత్రి వద్ద ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఉంది. భవనం బాగానే ఉన్నా అపరిశుభ్రం చోటుచేసుకుంది. నీరుగట్టువారిపల్లెలో గిరిజన సంక్షేమ బాలుర కాలేజీ హాస్టల్ అద్దె భవనంలో నడుస్తుంది. రేకుల షెడ్డులో విద్యార్థులున్నారు. బాత్‌రూము, లెట్రిన్‌లో దుర్వాసన వెదజల్లుతోంది.

- ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు ఐదు ఉండగా ఇందులో ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ అద్దెభవనంలో నడుస్తుంది. నక్కలదిన్నెలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం పెచ్చులూడుతోంది. మరుగు దొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. ట్యాంకర్లతో నీటిని సంపునకు నింపుతున్నారు. ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్ అద్దె భవనంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- బీసీ సంక్షేమ వసతి గృహాలు ఐదు ఉండగా స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని బీసీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో ఉంది. విద్యార్థులకు సరిపడా గదులు లేవు. నక్కలదిన్నె బీసీ బాలుర హాస్టల్‌పై కప్పు పెచ్చులూడుతున్నాయి. వర్షం వస్తే చాలు నీటితో నిండిపోతోంది. రామసముద్రం ఎస్టీ బాలిక హాస్టల్‌లో విద్యార్థినులు భోజనం చేసిన తరువాత ఇళ్లకు వెళ్లిపోతున్నారు. హాస్టల్‌లో ఎవరూ ఉండడం లేదు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ములకలచెరువు: ములకలచెరువు మండలంలో బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా, మోడల్ స్కూల్, బాలికల హాస్టల్, ఒక బాలుర హాస్టల్ ఉన్నాయి. సుమారుగా 550 మంది బాల, బాలికలు ఉంటున్నారు. హాస్టల్స్ ప్రహరీ గోడలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే విధంగా సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయాల్సి వుంది.

హాస్టల్‌కు ఫెన్సింగ్ లేదు

పెద్దతిప్పసముద్రం: పెద్దతిప్పసముద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఆరు నెలల నుంచి సీసీ కెమెరాలు పని చేయడంలేదు. మిగిలిన అన్ని వసతులు బాగానే ఉన్నాయి. కస్తూర్బా బాలికా విద్యాలయంలోకి ఎవరైనా అడుగు పెట్టాలంటే డీఈఓ అనుమతి పత్రం ఉండాలన్నారు. సదరు స్కూల్ లోపల కనీస సౌకర్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునే అవకాశం లేకపోయింది. అయితే ఈ రెండు హాస్టళ్ల ప్రహరీకి ఎలాంటి ఫెన్సింగ్ సౌకర్యం లేదు.

మూతపడిన బీసీ బాలుర హాస్టల్

తంబళ్లపల్లె: మండలంలోని బీసీ బాలుర హాస్టల్ అక్టోబర్ 1వ తేదీ నుంచి మూతపడింది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో కేవలం పది మంది విద్యార్థులు చేరారు. గదుల్లో పెచ్చుటూడి పడడంతో వారు కూడా ఇళ్లకు చేరుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు వస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్ భవనం

హాస్టల్ దయనీయం

బి.కొత్తకోట: బి.కొత్తకోట జీఎంసీ బాలయోగి బాలుర సాంఘిక సంక్షేమ విద్యాలయం వద్ద వసతి గృహం అత్యంత దయనీయంగా మారింది. ఇక్కడ 550 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాలయం ఆవరణలోనే హాస్టల్ నడుస్తోంది. వారికి ఏ మాత్రం సౌకర్యాలు లేవు. శ్లాబు పై పెచ్చులూడుతుండగా, విరిగిన ఫంకాలే వినియోగిస్తున్నారు. హాస్టల్ గదుల ఎదుట కుక్కలు సంచరిస్తూ వ్యర్థాలు విసర్జించినా పట్టించుకోలేని పరిస్థితి కనిపించింది. గదులు చెత్తా, చెదారంతో నిండిపోగా విద్యార్థులు అక్కడే నిద్రిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు ఇసుమంతైనా జరగడం లేదు. మసితో నిండిన గదులు, వర్షం వస్తే నీరు ఉరిసే భవనాల్లోనే విద్యార్థులు ఉంటున్నారు. కిటికీలు అధ్వానంగా మారాయి. పక్కనే పిచ్చి మొక్కలతో ఆవరణ మొత్తం నిండిపోయి దోమలు పెరిగాయి.

సిబ్బంది కొరత

బి.కొత్తకోట సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సిబ్బంది కొరత ఉంది. విద్యార్థులను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది ఏడుగురు భోజనం వడ్డించే సిబ్బంది, ఏడుగురు పారిశుద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. భద్రతా సిబ్బంది ఏడుగురికి గానూ నలుగురే ఉన్నారు. దీంతో పారిశుద్యం అధ్వానంగా మారింది. మురికి నీటి కాలువలు దెబ్బతిన్నాయి. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ సోలార్ ఫెన్సింగ్ లేదు.



బి.కొత్తకోట గురుకుల హాస్టల్ దుస్థితి

టూరిజం రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న ఈఈ సూర్యచంద్రారెడ్డి

రామసముద్రం: మండలంలో చేపట్టిన టూరిజం రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని క్వాలిటీ కంట్రోలర్ ఈఈ సూర్యచంద్రారెడ్డి తెలిపారు. రూ.70 లక్షలతో చేపట్టిన చెంబకూరు-గట్టు వెంకటరమణస్వామి ఆలయం రోడ్డు, రూ.3 కోట్లతో నిర్మిస్తున్న బల్లసముద్రం- వాలీశ్వర స్వామి కొండ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ సూర్యచంద్రారెడ్డి మాట్లాడుతూ నాణ్యత లోపించకుండా జాగ్రత్త వహించాలని, అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలని ఆదేశించారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ డీఈ పి.భాస్కర్, పీఆర్ డీఈ శివప్రసాద్, ఏఈ నిరంజన్‌రెడ్డి, కాంట్రాక్టర్లు కృష్ణంరాజు, రాజేష్, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

మంచి దస్తూరితో ఉత్తమ ప్రయోజనాలు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

మదనపల్లె సిటీ: మంచి దస్తూరితో ఉత్తమ ప్రయోజనాలు సాధ్యమవుతాయని ప్రముఖ చేతిరాత నిపుణులు సయ్యద్ జాఫర్, పఠాన్ మహమ్మద్‌ఖాన్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతిరాతపై మంగళవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి చేతిరాతపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు మహమ్మద్‌ఖాన్ చేతిరాతకు అవసరమైన విద్యా సామాగ్రి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీటీఎం రోడ్డు విస్తరణకు మార్గం సుగమం



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మదనపల్లె: పట్టణంలోని సీటీఎం రోడ్డు విస్తరణకు మార్గం సుగమమైంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా సీటీఎం రోడ్డులోని వందేళ్ల చింత చెట్లు ఇటీవల కొట్టివేయించారు. అయినా ట్రాఫిక్ పరిస్థితిలో మార్పు లేకపోవడం, సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ట్రోల్స్ రావడంతో సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సీటీఎం రోడ్డును పరిశీలించారు. రోడ్డు విస్తీర్ణం వదిలి వేసి, వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని, రెండు వైపులా వాహనాలు వెళ్లేందుకు దుకాణదారులు సహకరించాలని ఆయన సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులు సర్వే నిర్వహించి, వాస్తవ హద్దులు తేల్చాలని ఆదేశించారు. దీంతో అధికారులు సీటీఎం రోడ్డులో ప్రిలిమినరీ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ జకీరాఖాతూన్, రెడ్డెమ్మ, రెడ్డిశేఖర్, రెడ్డెప్ప, ఏఈ బోరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి



మాట్లాడుతున్న సాయిహితేష్

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఏబీవీపీ పూర్వ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయిహితేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రత్యక్షంగా పోరాడి ప్రాణాలు అర్పించిన వీరనారి అన్నారు. ఆడపిల్లలు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాలేపల్లి దుర్గాప్రసాద్, న్యాయవాది బాలజ్యోతి, ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



కలకడలో ముగ్గులు వేసిన విద్యార్థినులు

మదనపల్లె సిటీ: పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సైకియాట్రిస్ట్ డాక్టర్ రాధిక అన్నారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ పిల్లలందరూ రూ.100 చెల్లించి గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. పోస్టుకార్డు గురించి పిల్లలకు వివరించారు. అనంతరం గ్రంథాలయానికి డాక్టర్ రాధిక రూ.5,000, రిటైర్డు బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులురెడ్డి రూ.4,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య,టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కలకడ: శాస్త్రీయ బద్ధంగా ముగ్గులు వేయాలని కలకడ క్లస్టర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కలకడ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారి అమరనాథ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిరెడ్డి మాట్లాడుతూ రథం, దేవుడిరూపం, దీపాల అలంకరణ వంటి ముగ్గులు వేయాలన్నారు. వైవిరమణ, జనార్దన్‌రెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

తంబళ్లపల్లె: స్థానిక సాయి విద్యా మందిరంలో మంగళవారం 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాజిదా, గ్రంథాలయ అధికారి జిలానీబాషా, టీచర్లు పాల్గొన్నారు.

కాజేసిన రూ.42 వేలు రికవరీ చేయండి



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

పెద్దమండ్యం: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలో కాజేసిన రూ.42 వేలు వెంటనే రికవరీ చేయాలని జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అధ్యక్షతన మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన 11.78 కోట్ల పనులపై ఎస్ఆర్‌పి సుబ్బారావు పర్యవేక్షణలో ఆరుగురు డీఆర్‌పిలు మండలంలోని 17 పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ప్రజా వేదికలో వారు గుర్తించిన అంశాలను పంచాయతీల వారీగా వివరించారు. పలుచోట్ల చేపట్టిన పండ్ల తోటల పెంపకంలో మొక్కలు చనిపోయినట్లు డీఆర్పీలు పీడీ దృష్టికి తెచ్చారు. మొక్కలు చనిపోయిన చోట మళ్లీ మొక్క నాటించాలని సిబ్బందిని పీడీ ఆదేశించారు. అక్కడక్కడా కూలీలు చేపట్టిన పనుల్లో కొలతలు, మస్టర్‌లో వచ్చిన తేడాల కారణంగా గుర్తించిన సొమ్ము రూ.42 వేలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. పనులు చేపడుతున్న సమయంలో సిబ్బంది చిన్న చిన్న పొరబాట్లు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీడీలు ప్రతాప్, మధుబాబు, ఏపివో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో విద్యార్థుల మానవహారం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుర్రంకొండ: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గుర్రంకొండలో విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉర్దూ జెడ్పీహైస్కూల్ నుంచి ర్యాలీగా బయలుదేరి బస్టాండు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తప్పనిసరిగా మరగుదొడ్లు నిర్మించుకొని వినియోగించుకోవాలన్నారు. వాటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటే జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, ఎవో నాగిణివారెడ్డి, ఈవో హరి, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశెనగ సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ వాణిశ్రీ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్

గుర్రంకొండ: వేరుశెనగ పంట సాగులో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని వాల్మీకీపురం ఏడీఏ వాణిశ్రీ అన్నారు. మండలంలోని నడిమికండ్రిగ, పసలవాండ్లపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతుల నుద్దేశించి ఆమె మాట్లాడుతూ వేరుశెనగ పంట సాగు చేసుకొనే రైతులు కిలో విత్తనానికి ఎం45 మందు కలిపి విత్తనశుద్ధి చేసుకొవాలన్నారు. పంటకు పూత సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సం చేసుకోవాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకొన్న రైతులకు రూ.2 లక్షల బీమా వరిస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా కిసాన్ క్రెడిట్ కార్డులు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకొన్న రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేసుకోవాలన్నారు. ఎకరం వరికి రూ.126, వేరుశనగకు రూ.96, టమాటాకు రూ.1600 ప్రీమియం చెల్లించాలన్నారు. డిసెంబర్ నెల 15వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎవో రత్నమ్మ, సిరికల్చర్ అధికారి నాగిరెడ్డి, వీఏవోలు తరుణ్, రెడ్డిమద్దక్కల పాల్గొన్నారు.

పీలేరురూరల్ : 2024-25, 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పంట బీమా నమోదు చేసుకోవాలని ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. మండలంలోని జాండ్ల, గూడరేవుపల్లె గ్రామ పంచాయతీలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి సాగు చేసే రైతులు ఎకరాకు రూ.126, ప్రీమియం కడితే పంట బీమా రూ.42 వేలు వర్తిస్తుందన్నారు. డిశెంబర్ 15వ తేదీలోపు పంటబీమా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రంలో ఏవో రమాదేవి, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, వీహెచ్ఏలు రాజేశ్వరి, బిందు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: రైతులు పండించే పంటలకు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం సొమ్మును రైతులే చెల్లించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మండలంలోని తుమ్మరకుంటలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని మాట్లాడుతూ గతంలో రైతులకు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం సొమ్ము ప్రభుత్వమే మంజూరు చేసేదన్నారు. ఇప్పుడు సదరు ప్రీమియం సొమ్ము రైతులే డిసెంబరు 15వ తేదీ లోపు చెల్లించాలన్నారు. రైతులకు తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో లాభాలు కలిగించే పంట మార్పిడి విధానంపై అవగాహన ఉండాలన్నారు. ఏవోలు రమేష్, ప్రేమలత, లీలావతి పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉజ్వల భవిత

పీలేరు: విద్యార్థి దశలో కష్టపడితేనే ఉజ్వల భవిత ఉంటుందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్స్ రామ్మూర్తి, లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో సెల్‌ఫోన్స్, ఆన్‌లైన్ గేమ్స్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ భాగవతారిణి స్వర్ణలత, పాఠశాల కరస్పాండెంట్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కుళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించుకోండి

కురబలకోట: అంగళ్లులో అక్రమ నీటి కుళాయి కనెక్షన్లను వినియోగదారులు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని ఆ గ్రామ కార్యదర్శి టి.ఉదయ్‌కుమార్ కోరారు. ఆయన మాట్లాడుతూ అక్రమ నీటి వినియోగం సరికాదని, వెంటనే రెగ్యులర్ చేసుకోకపోతే వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తామని హెచ్చరించారు. కుళాయి కనెక్షన్లపై అనుమానాలుంటే తమను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మదనపల్లె: మండలంలోని తట్టివారిపల్లెలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ సిద్ధల దీపారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. మదనపల్లెకు చెందిన సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, ఎముకల వైద్య నిపుణులు, గుండె వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధల వేమారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్.ఉమేష్, డాక్టర్.చిదివ్లాస్, స్వాస్థ హాస్పిటల్ సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పనులు



రికార్డులు పరిశీలిస్తున్న శ్యామ్ ప్రకాష్‌రెడ్డి

బి.కొత్తకోట: మదనపల్లె డివిజన్ పరిధిలోని 15 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని డీఎల్‌సీఓ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సహకార సంఘంలో జరుగుతున్న కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. సంఘ లావాదేవీలు, పనితీరు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై సమీక్షించారు. సంఘ సభ్యుల జాబితాను సిద్ధం చేయాలని సీఈఓ కే.ఆదినారాయణను ఆదేశించారు. చనిపోయిన సభ్యుల స్థానంలో కుటుంబీకుల్లో ఒకరికి సభ్యత్వం కల్పిస్తామని చెప్పారు. సభ్యులైన ఆధార్, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నట్లు చెప్పారు.

సర్టిఫికెట్లు అందజేత



ఎన్‌సీసీ విద్యార్థులతో అధికారులు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఎన్సీసీ సర్టిఫికెట్లను ఎన్సీసీ అధికారిణి దేవకమ్మ అందజేశారు. ఇటీవల పరీక్షలు నిర్వహించగా వంద మంది పాసైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

అక్రమ లే అవుట్లపై కన్నెర్ర

కురబలకోట: మండలంలోని అంగళ్లు పరిసర ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లపై మండల అధికారులు కన్నెర్ర చేశారు. కన్వర్షన్ లేకుండా పంచాయతీ అప్రూవల్ లేని ప్లాట్లపై గురి పెట్టారు. వాటిని కొనరాదని ఎంపీడీఓ గంగయ్య, అంగళ్లు, కురబలకోట పంచాయతీ కార్యదర్సులు టి. ఉదయ్‌కుమార్, శేషగిరికుమార్ మంగళవారం హెచ్చరించారు. అక్రమ లే అవుట్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇలాంటి ప్లాట్లు కొనడం అమ్మడం చట్టరీత్యా నేరమని వారీ సందర్భంగా తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగావకాశాలు

తంబళ్లపల్లె: నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు పొందవచ్చునని జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేష్ అన్నారు. స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా జరిగింది. ముత్తూట్ ఫైనాన్స్, అపోలో కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళాకు 26 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకాగా ఇందులో 12 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోర్డినేటర్ చౌడయ్య టీఏలు సురేంద్ర, రమణ, నాగరాజ,వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఉత్సవం

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మల్లయ్యధారణ శివ తాండవ నృత్యం నిర్వహించారు. ఆలయ ఈఓ మునిరాజ, కొండ కిట్ట ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పీలేరు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలనకు గరీబీ హటావో, 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దుకు పునాదివేసిన ఇందిరాగాంధీ సేవలు మరువరానివన్నారు. అఖిల్, లోకేష్, శివ పాల్గొన్నారు.